



వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

నేడు పెదకాకానికి సీఎం చంద్రబాబు

- శంకరకంటి ఆసత్రిలో ఐ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా



సీఎం ప్రారంభించనున్న ఐ హాస్పటల్

పెదకాకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం రానున్నారు. ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన దుర్గం నాగమనోహర్ బ్లాక్ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ విభాగాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ శ్రీవాత్సవ పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని, సభా వేదిక ప్రాంగణాన్ని, ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణకాంత్, అధికారులు పాల్గొన్నారు.





బాలోత్సవంలో చిన్నారుల హావభావాలు





అద్వితీయం.. అబ్బురం


కళాత్మక హావభావాల వదనం.. వేదిక చలించిన మువ్వల సవ్వడి చరణం.. కళ్లను కట్టేసే సాంస్కృతిక వేషధారణం..'వీణ'ల విందుగా సంగీత శ్రవణం.. మేధలో దాగిన సృజనాత్మకత లేఖనం.. కవితా సంకలనం.. అబ్బుర పరిచిన నైపుణ్య వికాసం.. అద్వితీయం బాలోత్సాహం. రెండవ రోజు శనివారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణంలో బాలల పండుగ ఘనంగా జరిగింది. చిన్నారుల కేరింతలతో సందడిగా మారింది. విద్యార్థులు పలు విభాగాల్లో పోటీపడి తమ నైపుణ్య ప్రదర్శనలతో వీక్షకులను ఆకట్టుకున్నారు. - పెదకాకాని



కోటప్పకొండలో.. నిలువు దోపిడీ

- అధిక ధరలతో భక్తుల జేబులకు చిల్లు
- వాటర్ బాటిల్ రూ.30.. చిన్న కొబ్బరి కాయ రూ.50

కోటప్పకొండ(నరసరావుపేట రూరల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులను వ్యాపారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి స్వామి వారిని దర్శించుకు నేందుకు నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. స్వా మి వారి పూజలకు అవసరమైన సామగ్రితో పాటు తాగునీరు, ఇతర ఆహార పదార్థాలను కొండపై ఉన్న దుకాణాల్లో భక్తులు కొనుగోలు చేస్తుంటారు. ఇదే అవకాశంగా వ్యాపారులు అధిక ధరలతో వారిని దోచేస్తున్నా రు. తప్పనిసరి పరిస్థితుల్లో భక్తులు వ్యాపారులు చెప్పిన ధరలు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొండపై పార్కింగ్, ముఖ ద్వారం వద్ద కూల్‌డ్రింక్, ఆహారపదార్థాలు, కొబ్బరికాయలు, ఐస్‌క్రీమ్ దుకాణాలు ఉన్నాయి. ఆయా వస్తువు లను ఎమ్మార్పీలకే విక్రయించాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ధరల గురించి పట్టించుకోకుండా వ్యాపారులు ఇష్టం వచ్చినట్లుగా విక్రయిస్తున్నారు. సుదూర ప్రాం తాల నుంచి వచ్చే సామాన్య భక్తులు ఇక్కడి ధరలను చూసి విస్తుపోతున్నారు. రూ.20కి విక్రయించాల్సిన వాటర్ బాటిల్‌కు రూ.30, 200 ఎంఎల్ కూల్‌డ్రింక్ రూ.30, చిన్న కొబ్బరికాయ రూ.50 వసూలు చేస్తున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కార్తిక మాసంతో కొండకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. అయినా వ్యాపారుల దోపిడీని అధికారులు అడ్డుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సర్వర్ సమస్య..

కోటప్పకొండలో సర్వర్ సమస్య నెలకొంది. దీంతో భక్తులకు ప్రత్యేక దర్శనం టిక్కెట్లను జారీ చేయడం లేదు. నేరుగా నగదు వసూలు చేస్తున్నారు. ఇక విరాళాలకు సంబంధించి కూడా బిల్లులు జారీ చేయడంలేదని భక్తులు తెలిపారు. విరాళాలు, ప్రత్యేక దర్శనం టోకన్ల నగదు స్వామి వారికి చెందుతుందా లేదా అని భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అధిక ధరలపై చర్యలు

కోటప్పకొండలో వ్యాపారులు అధిక ధరలకు విక్రయించకూడదు. ఆయా కంపెనీల బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీకే విక్రయించాలి. అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం. సర్వర్ సమస్యకు ప్రత్యామ్నాయం పరిశీలిస్తాం.

- చంద్రశేఖరరావు, ఈవో

వాటర్‌షెడ్ మహోత్సవ్‌కు.. సర్వం సిద్ధం

- జాతీయ సదస్సుకు వేదికగా గుంటూరు
- సర్వాంగ సుందరంగా వెంగళాయపాలెం చెరువు

- హాజరుకానున్న కేంద్ర మంత్రులు చౌహాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- 130 మంది ప్రతినిధులు సహా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాక

గుంటూరు, గుంటూరు(తూర్పు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గుంటూరులో వాటర్‌షెడ్ మహోత్సవ్ పేరిట జాతీయ సదస్సు జరగనున్నది. సోమ, మంగళవారాల్లో నిర్వహించే ఈ సదస్సు కార్యక్రమాలకు గుంటూరు, వెంగళాయపాలెంలో ఏర్పాట్లను దాదాపుగా అధికారులు పూర్తిచేశారు. ఈ సదస్సుతో డెవలప్



చెరువు పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బూర్ల

మెంట్ కాంపొనెంట్ ఆఫ్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన(డబ్ల్యూడీసీ - పీఎంకేఎస్‌వై) 2.0కి శ్రీకారం చుట్టనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని జాతీయ స్థాయి సదస్సుని గుంటూరులో జరిగేలా చేశారు. ఈ సదస్సులో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు రూరల్ డెవలప్‌మెంట్ నుంచి సెక్రెటరీలు, కమిషనర్లు, 130 మంది ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుంచి ఐఏఎస్ అధికారులు రానున్నారు. దీంతో గత కొద్ది రోజులుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై జిల్లా అధికారులందరూ ప్రత్యేకంగా దృష్టి సారించారు. వాటర్ షెడ్ పథకంలో గుంటూరు రూరల్‌లోని వెంగళాయపాలెంలో చెరువు పునరుద్ధరణ పనులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

సభను విజయవంతం చేయాలి..

వాటర్ షెడ్ మహోత్సవ్ సభను సమర్థవంతగా నిర్వహించి విజయవంతం చేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వెంగళాయపాలెంలోని చెరువు పనులను, లయోలా పాఠశాలలో జరిగే సభా ఏర్పాట్లును కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సీపీ రెడ్డి, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకుడు వైవీకే షణ్ముఖకుమార్, రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే రామాంజనేయులుతో కలిసి శనివారం పరిశీలించారు.

కార్యక్రమాలు ఇలా..

- వాటర్ షెడ్ జాతీయ సదస్సులో తొలి రోజు సోమవారం గుంటూరులోని ఐటీసీ వెల్‌కం హోటల్లో ప్రారంభ కార్యక్రమం జరుగుతుంది.
- రెండో రోజు మంగళవారం వెంగళాయపాలెం లయోలా పాఠశాలలో ఉదయం సభ జరుగుతుంది. వాటర్ షెడ్ మహోత్సవ్ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి చౌహాన్ ప్రారంభిస్తారు. తొలుత వెంగళాయపాలెం చెరు వును సందర్శిస్తారు. మధ్యాహ్నం ఐటీసీ వెల్‌కం హోట ల్‌లో ముగింపు కార్యక్రమం జరుగుతుంది.

రూ.20 కోట్లతో ఆలయ అభివృద్ధి

- రూ.4 కోట్లతో ఘాట్ రోడ్డు పనులు
- పనులకు శంకుస్థాపనలో చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వినుకొండలోని కొండపై శ్రీరాముడిచే ప్రతిష్ఠించిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను రూ.20 కోట్లతో శ్రీకారం చుట్టాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. రామలింగేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు శనివారం భూమి పూజ చేశారు. గతంలో ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ సమగ్రంగా పనులు చేయకపోవడంతో నూతన కాంట్రాక్టర్‌చే తిరిగి ప్రారంభిస్తున్నట్లు జీవీ తెలిపారు. అంతకముందు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులు కూడా విరాళాలు అందించి గుడి నిర్మాణంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.11 లక్షలు విరాళాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఘాట్ రోడ్డు పనులకు ఇప్పటికే డీఎంఎఫ్ నిధులు రూ.4 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కేవలం ప్రభుత్వ సాయంతోనే పనులు ముందుకు సాగవని, ప్రతి ఒక్కరూ దేవాలయం తమది అన్నట్లుగా చేయిచేయి కలపాలన్నారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరిషకీలాబేగం, జనసేన నాయకుడు నిశ్శంకర శ్రీనివాసరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, సెక్రటరి సురేష్, న్యాయవాదులు సైదారావు, రామకోటేశ్వరరావు, నాయకులు పోట్ల రాధాకృష్ణమూర్తి, గట్టుపల్లి శ్రీనివాసరావు, పి.వి.సురేష్, గురునాథం, వెంకటరత్నం, రామ్మోహన్‌రావుతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఈవో సుధాకరరెడ్డి, శివలింగప్రసాద్, కాంట్రాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణం పనులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

అవసరం మేరకే పురుగు మందులు వాడాలి

- రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు సూచన

నకరికల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరి పొలాల్లో అవసరం మేరకు మాత్రమే పురుగు మందులను పిచికారి చేయాలని రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు సూచించారు. శనివారం నకరికల్లులో ఈ-పంట నమోదు చేసిన వరి పొలాలను తనిఖీ చేశారు. ప్రస్తుతం గింజ గట్టిపడే దశలో వరి ఉందని, ఎకరానికి 33 నుంచి 35 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

క్యూఆర్ కోడ్‌తో నాణ్యత నిర్ధారణ

పురుగుమందుల నాణ్యత విషయంలో రైతులకు అనుమానాలు ఉంటే ఆ డబ్బాలు, ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నిర్ధారించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు రైతులకు సూచించారు. నాణ్యతలో తేడా ఉంటే వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. నకరికల్లులో ఎరువుల, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. డీలర్ల పురుగు మందు లు, ఎరువులను ఆథరైజ్‌డ్ డిస్ట్రిబ్యూటర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. అనుమతి లేకుండా దుకాణాలు నిర్వహిస్తే పురుగు మందుల చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో కే దేవదాసు, వీఏఏ వై ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రమాదంలో.. ప్రజారోగ్యం

- మాచర్లలో బహిరంగంగా జంతువధ

- చనిపోయిన జీవాల మాంసం విక్రయాలు
- పట్టించుకోని పురపాలక సంఘ అధికారులు





లారీలకు వేలాడగట్టి జంతు వధ చేస్తున్న మాంసం విక్రేతలు

మాచర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అపరిశుభ్ర వాతావరణం.. దోమలు.. దుర్వాసన.. దుమ్ము.. ధూళి.. అక్కడే జంతువధ. వాటిని కొనుగోలు చేసి మాంసప్రియులు భుజిస్తుంటారు.. రోగాల బారిన పడుతుంటారు. అయినా అధికారులకు పట్టడంలేదు. ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో కాదు మాచర్లలో నెలకొన్న పరిస్థితి. పట్టణంలోని గొర్రెల మండిలో వారానికి ఒకరోజు జీవాల క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. చనిపోయిన, రోగాలతో అవసాన దశలో ఉన్న జీవాలను కొనుగోలు చేసి వాటిని అక్కడికక్కడే వధిస్తూ విక్రయిస్తున్నారు. రోగాలతో ఉన్న జీవాలను కొనుగోలు చేయడమే తప్పు అయితే.. వాటిని బహిరంగంగా అపరిశుభ్ర వాతావరణంలో వధించి అక్కడే లారీలకు కళేబరాలను వేలాడదీసి కుప్పలు వేసి విక్రయిస్తున్నారు. చనిపోయిన వాటిని కూడా అలాగే వధించి విక్రయిస్తున్నారు. వీటిని నిరోధించాల్సిన పురపాలక సంఘ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఆ రోజుకు విక్రయించగా మిగిలిన మాంసాన్ని ఫ్రిజ్‌లలో నిల్వ చేసి రెస్టారెంట్లకు, హోటళ్లకు అమ్మేస్తున్నారు. అవి తిని ప్రజలు అనారోగ్యం బారిన పడక తప్పదు. జీవాన్ని వధించి మాంసంగా విక్రయించాలంటే ముందుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో పశువైద్యాధికారి ధ్రువీకరించిన తర్వాత వధించి విక్రయించాలి. అయితే ఇలాంటి నిబంధనలు ఇక్కడ పాటించేవారు.. పట్టించుకునే వారు లేరు.



రోగాలతో చనిపోయిన జీవాలు

భవనాలు సరే డాక్టర్లేరి?

- ఇరవై నెలలుగా నియామకాలపై నిర్లక్ష్యం
- అరకొర పనులతో గత ఏడాది హడావుడిగా ప్రారంభం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దాచేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హడావుడిగా ఆస్పత్రి భవనాలు నిర్మించారు.. అరకొర పనులతో ఎన్నికలకు ముందు ప్రారంభోత్సవాలు చేశారు. అయితే 20 నెలలుగా ఆ ఆస్పత్రుల్లో మిగిలిన పనుల గురించి కానీ, వైద్యుల నియామకం గురించి పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. దాచేపల్లి నగర పంచా యతీలో తెలగడబజారు, నడికూడిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని రూ.160 లక్షలతో నిర్మించారు. గత ఏడాది ఫిబ్రవరి 18న ప్రారం భించారు. దీంతో పేరుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లకు భవనాలు ఉన్నా అక్కడ రోగులను పరీక్షించే వైద్యులు లేక పోవడంతో సిబ్బందే రోగులకు మందులు ఇచ్చి పంపుతున్నారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో దాచేపల్లి, నారాయణపురం, నడికూడి, ఇరికేపల్లి, అలుగుమల్లపాడు ప్రాంతాల్లో 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. ఈ ప్రాంతంలో ముగ్గు మిల్లులు, మైనింగ్ క్వారీలు, సున్నపురాయి గనుల కార్మికులు ఎందరో ఉన్నారు. ఇక్కడ ఫ్లోరైడ్ నీటితో పలువురు కాళ్లు, చేతుల నొప్పు లు, చచ్చుబడి పోవడం, ఎముకలు పెళుసు బారడం, కీళ్ల నొప్పులు వంటి అనారోగ్య సమస్యలతో పలువురు ఇబ్బంది పడుతుంటారు. సిమెంట్, కెమికల్ ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికులు ఉబ్బసం, ఆయాసం, చర్మ రోగాలు, కంటి చూపు వంటి సమస్యలతో బాధ పడుతుంటారు. వీరంతా చికిత్సల కోసం నిత్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ఆధార పడుతుంటారు. అయితే ఇక్కడ వైద్యులు లేకపోవడంతో సరైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారు.



సమస్యలకు నెలవు..

వైద్యుల నియామకాలకు తోడు పూర్తి స్థాయిలో విద్యుత్ లేకపోవడం, నీటి మోటార్లు పని చేయకపోవడం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. ఆస్పత్రి ప్రాంగణంలో చెత్తాచెదారం, ముళ్లకంపలు, విషసర్పాల సంచారం అధికంగా ఉంది. రాత్రి వేళ ఆస్పత్రులకు వాచ్‌మన్లు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా ఉన్నాయి. రాత్రులు జరిగే సన్నివేశాలతో తెల్లవారు జామున ఆస్పత్రులకు వచ్చే సిబ్బందికి రోత కలిగిస్తున్నాయి. ఇన్ని సమస్యల మధ్య రోగులకు సేవలు అందించటం సిబ్బందికి తలకు మించిన భారంగా ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వైద్యుల నియా మకంతో పాటు ఆస్పత్రుల్లోని సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ మల్లకంబ్ పోటీలు

● జాతీయ స్థాయి పోటీలకు 20 మంది ఎంపిక



విద్యార్థులతో స్కూల్ గేమ్ ఫెడరేషన్ సభ్యులు తదితరుల

గుంటూరు(విద్య),నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ మల్లకంబ్(పోల్‌కు తాడుకట్టి విన్యాసాలు చేసే క్రీడ) పోటీలు శనివారం ముగిశాయి. పెదకాకాని మండలం వెనిగండ్ల జడ్పీ స్కూల్‌లో 7, 8 తేదీల్లో అండర్ 14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా హాజరైన పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక అధికారి శేఖర్‌రాజు మాట్లాడుతూ పోటీలకు పది జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. నలుగురు సభ్యులతో సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేసి వివిధ విభాగాల్లో టోర్నమెంట్ నిర్వహించి 20 మంది క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశామని వివరించారు. పోటీలను డీఈఓ సీవీ రేణుక పర్యవేక్షించారు. విద్యార్థులకు ప్రత్యేక వసతులు కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గోపి, శిరీష, సీనియర్ ఉపాధ్యాయులు కొండయ్య, లక్ష్మీపతి, మాధవి పాల్గొన్నారు.

19 నుంచి వీరారాధన ఉత్సవాలు

కారంపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణంలో ఈ నెల 19 నుంచి ఐదు రోజులపాటు వీరారాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వీరాచారం పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు తెలిపారు. శనివారం కారంపూడిలో ఆయన మాట్లాడుతూ 19న రాచగావు, 20న రాయబారం, 21న మందపోరు, 22న కోడిపోరు, 23న కల్లిపాడు పేరుతో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఆయన వెంట పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ ఉన్నారు.

కంచి కామకోటి పీఠాధిపతికి ఘనస్వాగతం

కొల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతికి శంకర విజయేంద్ర సరస్వతి స్వామికి భక్తులు ఘన స్వాగతం పలికారు. శనివారం బాపట్ల నుంచి తెనాలిలోని ఓ కార్యక్రమానికి కొల్లూరు మీదుగా వెళుతున్న స్వామికి.. పార్వతి అమ్మవారి దేవస్థాన బ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగత ఏర్పాట్లు చేశారు. స్వామిని ఆలయంలోకి ఆహ్వానించగా సమయభావం వల్ల రాలేనని ఆయన చెప్పడంతో.. కమిటీ సభ్యులు అమ్మవారి కుంకుమ ఇచ్చాడు. నుదిటికి ఆ కుంకుమను దిద్దుకుని భక్తులను, కమిటీ సభ్యులను శంకర విజయేంద్ర సరస్వతి ఆశీర్వదించారు.



కుంకుమ దిద్దుకుంటున్న స్వామి

తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులో గుర్తుతెలియని మృతదేహం

తెనాలి క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులోని జెండా చెట్టు సమీపంలో శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 30-35 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి సమాచారం లభించకపోవడంతో.. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



జెండా చెట్టు వద్ద మృతదేహం

సాంకేతికతతో పాటు నైతిక విలువలు అత్యవసం

● సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్

గుంటూరు(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): న్యాయ, పరిపాలన వ్యవస్థలు ప్రజల అంచనాలకు తగిన విధంగా పని చేయాలంటే సాంకేతికతతో పాటు నైతికత, మానవత్వం కూడా అంతే అవసరమని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలోని కృత్రిమ మేధస్సు సాంకేతిక యుగంలో న్యాయ సహాయం, న్యాయం అందుబాటులోకి తేవడం.. అనే అంశంపై శనివారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏఐ, టెక్నాలజీ న్యాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నప్పటికీ, అవి ఎప్పటికీ న్యాయవాదులు, న్యాయమూర్తుల స్థానాన్ని భర్తీ చేయలేవని స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలు పరిశోధన, డ్రాఫ్టింగ్, పరిపాలనలో సహకరించినా.. న్యాయ సారం మాత్రం మానవ ఆలోచన, విశ్లేషణ, దయ, నైతిక తీర్పులోనే ఉంటుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గా ప్రసాద్‌రావు మాట్లాడుతూ టెక్నాలజీ శక్తివంతమైన సాధనం అయితే.. దాని విలువ మానవసేవలోనే ఉందన్నారు. భారత న్యాయ వ్యవస్థ వేగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ వర్సిటీ వీసీ ఆచార్య నాగభూషణ్, విజ్ఞాన్ విద్యాసంస్థలు చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ జస్టిస్ జాస్తి చలమేశ్వర్

వ్యవసాయంతో సమానంగా అక్వా కల్చర్

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

విజయపురిసౌత్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో వ్యవసాయంతో సమానంగా ఫిష్ అండ్ అక్వాకల్చర్‌ను ప్రోత్సహిస్తున్నట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో 6.24 లక్షల చేప పిల్లలను ఆయన విడుదల చేసి, మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకార సంక్షేమాన్ని గాలికి వదిలేసి దాదాపు 11 రకాల సంక్షేమ పథకాలను రద్దు చేసిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో వేట నిషేధం సమయంలో అందిస్తున్న రూ.10 వేల సాయాన్ని రూ. 20 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఆక్వా రంగాన్ని ప్రోత్సహించేందుకు విద్యుత్ యూనిట్ ధర రూ. 2.50 నుంచి రూ. 1.50కు తగ్గించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు, గురజాల ఆర్డీవో మురళి కృష్ణ, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, టీడీపీ యువ నేత జూలకంటి అక్కిరెడ్డి, పంగులూరి పుల్లయ్య, చిరంజీవిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



నదిలో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

పటిష్టంగా యువ ఆపద మిత్ర పథకం అమలు

● ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్

తాడేపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం యువ ఆపద మిత్ర పథకం ప్రారంభించిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఈ పథకంలో భాగంగా ఒడిశా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఐదు రాష్ట్రాలకు చెందిన వలంటీర్లకు ఈ పథకం ద్వారా శిక్షకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఏపీలోని అన్ని జిల్లాల నుంచి 52 మంది వలంటీర్లు 21 రోజులపాటు శిక్షణ పొంది వచ్చారన్నారు. వారిని అభినందిస్తూ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రఖర్ జైన్ మాట్లాడుతూ శిక్షణ పొందిన ఆపద మిత్ర సేవకులు రాష్ట్రంలోని ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, నెహ్రూ యువకేంద్రం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి యువజన సంఘాలకు చెందిన 12,360 మందికి, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసు, అగ్నిమాపక ట్రైనింగ్ సిబ్బందితో కలిసి శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. విపత్తులు సంభవించినప్పుడు భద్రతా దళాలకు అండగా ఉండడం, ప్రజలను రక్షించడం, సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించడం, ప్రథమ చికిత్సలు అందించడం.. ప్రమాద నష్టం తగ్గింపులో స్వచ్ఛంద సేవా సంస్కృతిని పెంపొందించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఆపద సమయాల్లో ఉపయోగపడే అత్యవసర కిట్, ధృవపత్రం, గుర్తింపు కార్డులు, విపత్తుల పట్ల అవగాహన పోస్టర్లు ప్రఖర్ జైన్ అందజేశారు. ఈ సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ఏట హనుమంతరావు, ఎస్ఈఓసీ ఇన్‌చార్జి పీటర్, వలంటీర్లు పాల్గొన్నారు.



దిండి సముద్ర మార్గంలో 28 ఆవులు మృతి

నిజాంపట్నం(రేపల్లె), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో సముద్రం ఒడ్డున 28 ఆవులు మృతి చెందాయని.. దానికి కారణం తెలియడం లేదంటూ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం నిజాంపట్నం మండలం దిండి సముద్రం ఒడ్డున పల్లపట్ల, దిండికి చెందిన రైతుల ఆవులు మృతిచెందాయి. దిండి సమీపంలో హేచరీల నుంచి వచ్చే వ్యర్థాలు కలుషితమైన నీటిని తాగి ఆవులు చనిపోయాయని కొందరు, మడ ఆకులు తిని చనిపోయాయని మరికొందరు భిన్న వాదనలు వినిపిస్తున్నారు. సమీపంలోని పశు వైద్యులు ఆవులను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఒక ఆవును తీసుకువచ్చారు. గుంటూరు జిల్లా గోశాల నుంచి కొంతమంది సభ్యులు వచ్చి ఆవుల మృతిపట్ల విచారణ చేశారు. అయితే రైతులు ఫిర్యాదు ఇవ్వలేదని కేసు నమోదు చేయలేదని పోలీసులు చెబుతున్నారు.



తీర ప్రాంతంలో చనిపోయిన ఆవు

మోటారు సైకిల్‌ని ఢీకొట్టిన లారీ..ఒకరు మృతి

నరసరావుపేట రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామం వద్ద మోటారు సైకిల్‌ను లారీ ఢీకొట్టింది. శనివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మరోకరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ ఫాతిమా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మాచవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గంగిరెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తిరుపతిరావు వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి గంగిరెడ్డిపాలెం సమీపంలో ఆటో, ఎద్దుల అరక ఢీకొన్న ఘటనలో జానపాడు గ్రామానికి చెందిన గుడిపూడి కోటేశ్వరరావు(52)కు తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం అతను మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు లక్ష్మీ కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అమరేశ్వరుని సన్నిధిలో..

హైకోర్టు జడ్జి సుబ్బారెడ్డి దంపతులు

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి దంపతులు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారి పేరున స్వామివార్లకు పూజలు నిర్వహించి, ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. దేవస్థాన సహాయ కమిషనర్ రేఖ న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.



న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ రేఖ

ఐటీ అధికారి పేరుతో బెదిరింపులు

● 8 పోలీస్‌స్టేషన్లలో కేసులు ● చిలకలూరిపేటలో అరెస్టు

చిలకలూరిపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను శాఖ అధికారిని అంటూ వ్యాపారులను బెదిరించి డబ్బు కాజేస్తున్న గుంటూరు ఆర్టీసీ కాలనీకి ఓ వ్యక్తిని చిలకలూరిపేట అర్బన్ పోలీసులు శనివారం ఇక్కడ అరెస్టు చేశారు. అర్బన్ సీఐ పి.రమేష్ వివరాల మేరకు.. చదలవాడ తిరుమలరెడ్డి అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారుల వివరాలు సేకరించాడు. ఆదాయ పన్ను దాడులు చేస్తామని, లెక్కల్లో ఏమాత్రం తేడా ఉన్నా పెనాల్టీలు వేస్తామని, ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని వారికి ఫోన్ చేసి బెదిరిస్తున్నాడు. డబ్బులు ఇస్తే ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇస్తున్నాడు. ఇతడి ఆగడాలకు సంబంధించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో నిఘా పెట్టారు. అతడిని అరెస్టు చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై 8 పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయన్నాయని పోలీసులు తెలిపారు. మండలంలోని పసుమర్రు గ్రామంలో ఓ పొగాకు కంపెనీ యజమానిని కూడా నిందితుడు బెదిరించి రూ. 15 వేలు వసూలు చేశాడని పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సీఐ పి.రమేష్

సృజనాత్మక శక్తితో ముందుకు సాగాలి

● రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి
● ఘనంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థిని షేక్.ముబీనాకు పట్టా అందజేస్తున్న డాక్టర్ కె.మధుమూర్తి, శ్రీనివాసరావు

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో రాణించాలంటే సృజనాత్మక శక్తితో ముందుకు సాగాలని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి పేర్కొన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల 12వ స్నాతకోత్సవం శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ మధుమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి.. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులతో కలిసి జెన్ టెక్నాలజీ రీసెర్చ్ బ్లాక్‌ను ప్రారంభించారు. తదుపరి డిగ్రీ పొందిన 650మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కొత్తవి నేర్చుకోవాలనే తపన, నిరంతర శ్రమ ఉన్నప్పుడే ఆయా రంగాల్లో అనుకున్న ప్రగతిని తప్పక సాధిస్తారన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల పురోభివృద్ధికి బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తూ విద్యా రంగంలో రాణిస్తూ మంచి పేరు సాధించాలని ఆకాంక్షించారు. స్వర్గీయ ముప్పలనేని శేషగిరిరావు ఆలోచనాత్మక శక్తిని, దూరదృష్టిని కొనియాడారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాల సాధన దిశగా కృషి చేస్తూ.. ఉన్నతమైన ప్రమాణాలతో సాంకేతిక విద్యనందిస్తున్నామన్నారు. ముప్పలనేని శేషగిరిరావు మహోన్నతమైన సేవలను గుర్తు చేసుకున్నారు. ముఖ్య అతిథి డాక్టర్ కె.మదుమూర్తిని ఎడ్యుకేషన్ సొసైటీ పాలక మండలి ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కారుమంచి వెంకట్రావు, పారెపల్లి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ దొడ్డపనేని వెంకయ్యచౌదరి, కోశాధికారి కోట వీరబ్రహ్మయ్య, కో-ఆర్డినేటర్ డాక్టర్ షేక్.నజీర్, ఆంగ్ల విభాగ అధ్యక్షులు డాక్టర్ పీవీ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ ఎం.వీరయ్య, డాక్టర్ షేక్.షబీన్‌సూల్తానా, తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ కృష్ణ మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను సీఎస్ఈ విద్యార్థి సి.హెచ్.పుణ్యవతికి, సిల్వర్ మెడల్‌ను ట్రిపుల్ఈ విద్యార్థిని కె.లలిత సత్య శ్రీమల్లికకు, బ్రాంజి మెడల్ మెకానికల్ విద్యార్థి ఎన్.రామ్‌కుమార్‌కు ప్రదానం చేశారు. డిగ్రీలు సాధించిన విద్యార్థులు కేరింతలు కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ఆయువు తీరినా.. మమకారం మరువక..



ఆవు కళేబారానికి మేళతాళాలతో అంతిమయాత్ర

కొల్లూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లు ఎంతో ప్రేమగా చూసుకున్న ఆవు అనారోగ్యంతో మృతి చెందడంతో.. కళేబరానికి అంతి సంస్కారాలు నిర్వహించి తన మమకారాన్ని చాటుకున్నాడు ఈ యజమాని. మండలంలోని పోతార్లంక గ్రామానికి చెందిన ఈడ్పుగంటి కుటుంబరావు పోషణలోని ఆవు 20 ఏళ్లలో.. పది సార్లు లేగ, పెయ్య దూడలు అందించింది. ఇటీవల ఆవు అనారోగ్యానికి గురికాగా.. పశు వైద్యులు వైద్య సేవలు అందించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. శనివారం ఆవు కళేబరానికి పసుపు, కుంకుమ, పూలతో పూజలు నిర్వహించి.. ఎడ్ల బండిపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో అంతిమ యాత్ర చేశారు. తమ సొంత స్థలంలో కళేబరాన్ని ఖననం చేశారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గుంటూరు ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు బ్రాహ్మణ సంఘ వన సమారాధన

గురజాలటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని శ్రీగంగా పార్వతి సమేత ఇష్టకామేశ్వర స్వామి ఆలయంలో బ్రాహ్మణ సంఘ వన సమారాధన నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు రెంటాల నాగేశ్వరరావు, నారాయణబట్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. స్వామికి ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ సంఘీయులు హాజరుకావాలని కోరారు.

16న విశ్వ బ్రాహ్మణ..

నకరికల్లు : సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ఈనెల 16వ తేదీన విశ్వబ్రాహ్మణ నియోజకవర్గ కార్తీక వనసమారాధన నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు చింతాడ రమేష్ తెలిపారు. శనివారం నకరికల్లులో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి రంగు నాగభూషణం, మండల అధ్యక్షుడు వేములూరి సుబ్బాచారి, వానపాముల రత్నమాచారి, రాళ్ళబండి నాగేశ్వరరావు, అల్లూరి మోహనరావు, దాసు భాస్కరాచారి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

11న పిరమిడ్ ధ్యాన ఆశ్రమం ప్రారంభం

విజయపురిసౌత్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న పితామహ పత్రీజీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని విజయపురిసౌత్‌లో పిరమిడ్ ధ్యాన ఆశ్రమం ప్రారంభించనున్నారు. ఈ మేరకు శనివారం పిరమిడ్ స్పిరుచ్చువల్ మూవ్‌మెంట్స్ ఇండియా సభ్యులు, పిరమిడ్ మాస్టర్ సతీష్ ఆధ్వర్యాన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.

రూరల్ సీఐగా హైమారావు



సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి రూరల్ నూతన సీఐగా హైమారావు శనివారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పని చేసిన సుబ్బారావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు నుంచి ఆయన బదిలీపై సత్తెనపల్లి రూరల్ సీఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలు సహకరించాలన్నారు.

చెక్కుల పంపిణీ

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ మంజూరు చేసిన చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం రాత్రి పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అందించారు. నకరికల్లు మండలం కుంకలగుంటకు చెందిన పాపాబత్తిన వెంకటేష్, ఉప్పలపాడుకు చెందిన అల్లంశెట్టి శ్రీనివాస్‌లు టీడీపీ సభ్యత్వం కలిగి ఉన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. వారికి బీమా సౌకర్యం ఉండటంతో పార్టీ రాష్ట్ర కార్యాలయం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చెక్కులను మంజూరు చేసింది. రెండు కుటుంబాల సభ్యులకు ఎమ్మెల్యే కన్నా చెక్కులను అందించారు.

గృహాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

● హౌసింగ్ ఏఈ మరియదాసు

మాచర్ల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ పథకం కింద పక్కా గృహాలు లేని చెంచులు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ మరియదాసు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ జన్‌మన్ పథకం కింద మండలంలోని నాగువరం పంచాయతీ పరిధిలో గల బీకేవీపాలెం చెంచుకాలనీ, బోధనంపాడు చెంచుకాలనీ గ్రామాల్లో గృహాలు లేని ఎరుకుల, యానాది, సుగాలీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు హౌసింగ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అన్నదానం గొప్పది

పెదకూరపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దానాల్లో కెల్ల అన్నదానం గొప్పదని బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్, తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పరుచూరి పూర్ణచంద్రరరావు అన్నారు. పెదకూరపాడుకు చెందిన అర్తిమళ్ళ శేషయ్య, జానకి దంపతుల కుమార్తె హేమశ్రీ, నేతాజీల వివాహం సందర్భంగా మండలంలోని 75 తాళ్ళూరు శాంతికాలనీలో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్తిమళ్ళ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల జవాబుదారీ వేదిక ప్రజాదర్బార్

● అధికారుల స్పందనలో అలసత్వం వద్దు
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



వెల్దుర్తిలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకు జవాబుదారీ వేదిక ప్రజాదర్బార్ అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సమస్యలపై ప్రజలు ప్రభుత్వ కార్యాలయం మెట్లు ఎక్కుతుంటే అక్కడ సత్వర పరిష్కారం లభించకుంటేనే తన గడప తొక్కాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. సమస్య ప్రాథమిక దశలోనే స్థానిక అధికారులు పరిష్కరిస్తే ప్రజా ప్రతినిధుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాదర్బార్‌లో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

ప్రజా దర్బార్‌కు 56 అర్జీలు

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వివిధ సమస్యలపై ప్రజలు 56 అర్జీలు అందించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, వెల్దుర్తి ఎస్‌ఐ సమందర్‌వలి, వడ్డెర కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొమెర దుర్గారావు, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, మాచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ రాజబోయిన మధు, వజ్రం నాయక్, జూలకంటి చిరంజీవరెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి కేశిరెడ్డి హనిమిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏసీ రిఫ్రిజిరేటర్ల టెక్నీషియన్ల వినతి

మాచర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో షాపులు నిర్మాణం కోసం ఏసీ రిఫ్రిజిరేటర్ల టెక్నీషియన్లు శనివారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించారు.

బాధిత కుటుంబాల్లో చంద్రన్న వెలుగులు

రెంటచింతల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోలి గ్రామానికి చెందిన మాచవరపు నాగేశ్వరరావు మార్చి 9వ తేదీన ద్విచక్రవాహనంపై ముటుకూరు తిరునాళ్లకు వెళ్లి వస్తూ పాలువాయిగేట్‌లో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి పడి మృతి చెందాడు. నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలనే భావంతో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పార్టీ సభ్యత్వ కార్డు, రేషన్ కార్డు నకలును టీడీపీ కేంద్ర కార్యాలయంలో అందచేశారు. దీంతో శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబీకులకు అందచేశారు.

ప్రకృతి సేద్యమే భవిష్యత్తు జీవన విధానం

విజయపురిసౌత్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యమే భవిష్యత్ జీవన విధానమని ఎమ్మెల్యే అన్నారు. శనివారం మండలంలోని పెద్ద అనుపులో శ్రీరంగనాథస్వామి ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ సహజ సిద్ధంగా తయారు చేస్తున్న కషాయాలను, ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన సిద్ధం చేసిన ఎరువులను పరిశీలించి వినియోగించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయంతో పండించే ఉత్పత్తులకు ప్రపంచంలో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తలపెట్టిన ప్రజల వద్దకు పాలన కార్యక్రమం ఆదర్శంగా నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం అమరావతిలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవినీతి రహితంగా ప్రజాసమస్యలు పరిష్కారించాలని అన్నారు. ప్రతి శనివారం ప్రజాదర్బార్ నిర్వహించడంతో పాటు ఈనెల 17 నుంచి నియోజకవర్గంలోని 100గ్రామాల్లో 100రోజులు పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకుంటానని తెలిపారు. ప్రజాదర్బార్‌లో 250అర్జీలు రాగా వాటిలో రెవెన్యూ 105, పింఛనుకు 50, అభివృద్ధి పనుల కోసం 50, పంటనష్టం 10, ఉపాధికై 30, పోలీసుశాఖకు సంబంధించి పది అర్జీలు వచ్చాయి. వీటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ హనుమంతరావు, అధికారులు, ప్రజాప్రతినిదులు, పాల్గొన్నారు.

వృత్తి విద్యా నైపుణ్య పోటీల్లో దొడ్లేరు హైస్కూల్‌కు ప్రథమ స్థానం

● విద్యార్థులు తయారు చేసిన రెండు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థులకు శిక్షణ అందించిన ఉపాధ్యాయుడికి జ్ఞాపికను అందజేస్తున్న డీఈవో చంద్రకళ

క్రోసూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన వృత్తివిద్యా నైపుణ్య పోటీల్లో క్రోసూరు మండలం దొడ్లేరు జడ్పీ హైస్కూల్‌కు ప్రథమ స్థానం లభించింది. ఈ పోటీలు సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో సత్తెనపల్లి సమీపంలోని ధూళిపాళ్ళ లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగాయి. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు బీ హారిక, భార్గవి, శశిరేఖ, హారిక బృందం తయారు చేసిన వాటర్ స్టార్ ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే 10వ తరగతి విద్యార్థులు లక్ష్మీనరసిం హారెడ్డి, గౌస్ మొహిద్దీన్, షామిద్, డిబేరి తయారు చేసిన స్మార్ట్ ఫెట్టి అండ్ సీడర్ ప్రాజెక్టు కూడా జిల్లా స్థాయిలో ప్రథమ స్థా నంలో నిలిచింది. ఈ రెండు ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయని శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు మణికంఠ తెలిపారు. ఉపాధ్యాయుడు మణికంఠకు డీఈవో చంద్రకళ ప్రత్యేక అభినందనలు తెలియజేసి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

రెంటచింతల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా పోటీల్లో జెట్టిపాలెం మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులందుకున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య చెప్పారు. పోటీల్లో 9, 10 తరగతులకు చెందిన 10 మంది విద్యార్థులు పాల్గొని ప్రాజెక్టు వర్క్‌ను సమర్పించి జిల్లా స్థాయిలో మూడో బహుమతిని కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

దుర్గి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

దుర్గి : స్థానిక జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు అలేఖ్య, యశస్విని, మౌనిక, శివకోటేశ్వరరావు, చరణ్, లోకేశ్, దేవప్రాన్సిస్ రూపొందించిన ప్రాజెక్ట్ రిటైల్ ట్రేడ్‌లో రెండో బహుమతిని సాధించి డీఈవో చేతుల మీదుగా షీల్డ్, సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం హనుమంతరావు, ఉపాధ్యాయులు రమేష్, జీసీహెచ్ అనంతరామయ్య, కరీం, కృష్ణయ్య, కోటేశ్వరరావు, పద్మ, భారతి, సంపూర్ణ, హబీబున్నీసా, పూర్వ విద్యార్థి అబ్బాస్, వ్యాయామ ఉపాధ్యాయులు బండ్ల ప్రసాద్, సునీత, ట్రైనర్ గంగరాజు విద్యార్థులను అభినందించారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి

క్రోసూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ కోర్సుల్లో ఇచ్చే శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్యక్రమ ఇన్‌చార్జ్ బాపతు అంజిరెడ్డి శనివారం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తుందన్నారు. ఈనెల 10 నుంచి 15వ తేదీ లోపు తమ దరఖాస్తులను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందజేయాలన్నారు. వివరాలకు 7779858789లో సంప్రదించాలన్నారు.

భూమిని కబ్జా చేయడానికి శ్రీనివాస్ ప్రయత్నం

● జనార్దన్‌రావు ఫిర్యాదు



ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న జనార్దన్‌రావు

అచ్చంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనూరు గ్రామంలో పదెకరాల భూమిని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్న శాఖమూరి శ్రీనివాస్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోనూరు గ్రామానికి చెందిన పసుపులేటి జనార్దన్‌రావు ఎమ్మెల్యే ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం అమరావతిలో జరిగిన ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు చేశారు. జనార్దన్‌రావు తల్లి పేరుపై ఉన్న పదెకరాల భూమిని శ్రీనివాసరావు కబ్జాకు ప్రయత్నిస్తున్నాడన్నారు. తమ భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరారు. జనార్దన్‌రావు తల్లి పసుపులేటి రాజ్యలక్ష్మి పేరుతో 40 సంవత్సరాల క్రితం కస్తల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేశామని, అప్పటి నుంచి ఆ భూమిని తామే చేసుకుంటున్నట్టు జనార్దన్‌రావు పేర్కొన్నారు. కాని శాఖమూరి శ్రీనివాస్ నకిలీ పేపర్లను సృష్టించి తమ భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించారన్నారు. దీనిపై గతంలో ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేశామన్నారు. తక్షణమే స్పందించి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకొని తమ భూమిని తమకు ఆన్‌లైన్ చేయాలని ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు.

ప్రభుత్వ బడిలో అందమైన బీజాక్షరాలు



విద్యార్థులకు చేతిరాతను నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు ఫిరోజ్‌బాషా

పిడుగురాళ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలచెరువు మెయిన్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఫిరోజ్‌బాషా తన అంకితభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త జీవం పోస్తున్నారు. ప్రతి ఉదయం ముందుగానే స్కూల్‌కు హాజరై సాయంత్రం వరకు పిల్లలతోనే గడుపుతూ విద్యాబోధనలో తాను చూపిస్తున్న నిబద్ధత అందరికీ ఆదర్శంగా మారిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఉపాధ్యాయుడు ఫిరోజ్‌బాషాను అభినందిస్తూ లేఖ రాశారు. పిల్లలకు తెలుగు, ఇంగ్లీష్‌లో అందమైన హ్యాండ్ రైటింగ్ నేర్పుతూ వారి చేతిరాతను డిజిటల్ ప్రింట్‌లా మార్చిన ఫిరోజ్‌బాషా విద్యారంగంలో ఒక నూతన దిశ చూపిస్తున్నారు. విద్యార్థుల్లో ఉన్న భయాలను పోగొట్టి ఆట పాటలతో ఆత్మీయంగా బోధన అందిస్తూ వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కృసి చేస్తున్న టీచర్లకు, సిబ్బందికి మంత్రి లోకేశ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

అధిక లోడుతో ఆటోలను నడిపితే కఠిన చర్యలు

● మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా



ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నఫీజ్‌బాషా

విజయపురిసౌత్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోల్లో అధిక లోడుతో ప్రయాణికులను ఎక్కించి నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్లరూరల్ సీఐ నఫీజ్‌బాషా అన్నారు. శనివారం మాచర్ల మండలం కొత్తపల్లి జంక్షన్ వద్ద ప్రయాణికులకు, డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అధిక లోడుతో వెళ్తున్న 8 ఆటోలపై అపరాధ రుసుము విధించారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల : పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై సీఐ వెంకట్రావు, ఎస్‌ఐ నాగరాజు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. లైసెన్సులు వెంట ఉంచుకోవాలన్నారు. ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించకుండా ఉండాలన్నారు. డ్రైవర్లు అప్రమత్తతతో లేకుంటే మన జీవితాలే కాకుండా, ప్రయాణికుల జీవితాలు కూడా రోడ్డున పడతాయన్నారు. లైసెన్సు లేని వారికి ఆర్టీవో అధికారులతో మాట్లాడి అందరికీ లైసెన్సులు అందేలా చూస్తామని హామీనిచ్చారు.

కేవీలో ప్రతిభ చూపిన యశ్వంత్‌కు అభినందనలు



కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థి జొన్నలగడ్డ యశ్వంత్‌కు చెక్కు అందజేస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి హిందీ సబ్జెక్టులో జాతీయ స్థాయిలో మార్కులు సాధించిన జొన్నలగడ్డ యశ్వంత్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ జగదీష్ గుప్తా, ఇతర ఉపాధ్యాయులు శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ యశ్వంత్‌ను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తేవాలన్నారు. పాఠశాల తరపున రూ.5వేల రివార్డును యశ్వంత్‌కు అందించారు. యశ్వంత్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు మణిదాసు తదితరులున్నారు.

పాటల పోటీల్లో శివబాబుకు ప్రథమ బహుమతి

దుర్గి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో ఉన్న శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాత్రి సినిమా పాటలు, పద్యాలు, ఏకపాత్రాభినయ పోటీలు కోలాహలంగా నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ఎంఎస్ శివబాబు ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు.

వందేమాతరం నినాదంతో స్వాతంత్ర్యం

● అధ్యాపకుడు వెంకట్రామిరెడ్డి

మాచర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతరం నినాదంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అబ్జర్వర్, సీనియర్ అధ్యాపకుడు జి.వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 150 సంవత్సరాల వందేమాతర గేయం ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ మహేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ సాయిమార్కండారెడ్డి, అధ్యాపకులు ఎస్‌ఎఫ్‌ఎస్ రాణి, జయలక్ష్మి, మమత, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు తాత్కాలిక మరమ్మతులు

ఎఫెక్ట్



వాగులో ఉన్న సిమెంట్ పైపులపై గ్రావెల్‌తో నిర్మించిన రహదారి

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మునగోడు గ్రామంలో ఎద్దువాగుపై ఉన్న వంతెన వరదల ప్రభావంతో దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రచురితమైన కథనానికి స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పందించారు. స్థానిక నాయకుడు షేక్ షరీఫ్‌తో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. సిమెంట్ పైపులపై ఉన్న గ్రావెల్ వరదలకు కొట్టుకుపోవడంతో రైతులు తమ భూములకు 15కి.మీ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం చేసిన మరమ్మతుల వల్ల రైతులు తమ భూములకు సౌకర్యవంతంగా వెళుతున్నారు. వాగుపై శాశ్వత హైలెవల్ వంతెన నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా అంచనాలు వేయించి త్వరలో వంతెన నిర్మాణం చేపడతారని ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు.

నేడు ప్రమాణ స్వీకార మహోత్సవం



ఆసుల జగన్



ఓర్సు ఆనంద్



అక్కల వెంకట రామిరెడ్డి

బెల్లంకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని పదవులను పొందిన టీడీపీ నాయకుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం బెల్లంకొండ టీడీపీ కార్యా లయంలో టీడీపీ నాయకుల, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా గంగిరెడ్డిపాలెంకు చెందిన సర్పంచ్ ఆసుల జగన్, నందిరాజుపాలెం సొసైటీ చైర్మన్‌గా చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఓర్సు ఆనంద్‌ను, బెల్లంకొండ మండల అధ్యక్షుడిగా మన్నె సుల్తాన్‌పాలెం గ్రామానికి చెందిన అక్కల వెంకట రామిరెడ్డిని ఎమ్మెల్యే ప్రవీణ్ వీరిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆదివారం ఉదయం కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


ఏరియా వైద్యశాలలోని నవజ్యోతి శిశువుల స్థిరీకరణ యూనిట్

చేరువలో చిన్నారులకు చికిత్స

- ఏరియా వైద్యశాలలో అత్యాధునిక వైద్య సేవలు
- నవజాత శిశులపై వైద్య సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ
- మధ్యతరగతి, పేద తల్లిదండ్రులకు వరం..

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చిన్నారులకు చక్కటి వైద్యాన్ని వైద్యులు, సిబ్బంది అందిస్తున్నారు. పుట్టిన పిల్లల దగ్గర నుంచి ప్రతి ఒక్కరికీ ఇక్కడే నాణ్యమైన వైద్య సేవలందిస్తూ.. ప్రజల మన్ననలు పొందుతున్నారు. పిల్లలు అనారోగ్యానికి గురైతే.. తల్లిదండ్రుల ఆందోళన అంతాఇంతా కాదు. దీనిని ప్రైవేట్ హాస్పిటల్స్ ఆసరా చేసుకొని వేలాది రూపాయలు వారి నుంచి వసూలు చేస్తాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఇలా ఆర్థికంగా చితికిపోకుండా.. చిన్నా రులకు మెరుగైన వైద్య సేవలను ఏరియా వైద్య శాలలోనే ప్రభుత్వం అందిస్తోంది. చిన్నా రుల వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది నిత్యం అందు బాటులో ఉంటున్నారు. వైద్యశాలలోని నవజాత శిశువుల యూనిట్‌లో అవసరమైన పరికరాలను సమకూర్చారు. అప్పుడే పుట్టిన పిల్లలకు పచ్చకా మెర్లు, బరువు తక్కువ, ఉమ్మ నీరు ఇలా.. తీవ్ర అనారోగ్య సమస్యలకు నవజాత శిశువుల స్థిరీ కరణ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నారు. జ్వరం వచ్చినా, ప్లేట్‌లెట్స్ తగ్గినా ఇక్కడే అధు నాతన వైద్యం అందజేస్తున్నారు. 24 గంటలు వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణ ఉంటోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 953 మంది చిన్నారులకు వివిధ రకాల వైద్య సేవలను అందించారు.

ఆస్పత్రిలో ఆధునిక పరికరాలు



చిన్నారుల వైద్య సేవలకు హాస్పిటల్‌లో ఆధునిక పరికరాలున్నాయి. ఇద్దరు వైద్యులతో ఇక్కడ సేవలు అందిస్తున్నాం. అప్పుడే పుట్టిన చిన్నారులకు ఇక్కడ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. వీటిని సద్వినియోగం చేసు కోవాలి. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆస్పత్రికి అవసరమైన పరికరాలను ప్రభుత్వం ద్వారా సమకూర్చుతున్నారు.

-డాక్టర్ లక్ష్మణరావు, సూపరింటెండెంట్, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

అద్వితీయం.. అబ్బురం

- కోలాహలంగా వీవీఐటీయూ బాలోత్సవ్
- ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు



పెదకాకాని, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలల పండుగ అద్వితీయంగా సాగుతోంది. చిన్నారుల సాంస్కృతిక కళా ప్రదర్శనలు అబ్బురపరుస్తూ.. విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆనందోత్సాహాల నడుమ వీవీఐటీయూ బాలోత్సవ్ 2025 వేడుకలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు శనివారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణం విద్యార్థుల కేరింతలతో సందడిగా మారింది. సెలవుదినం కావడంతో.. సందర్శకుల తాకిడి బాలోత్సవ్ ప్రాంగణంలో పెరిగింది. 280 పాఠశాలల నుంచి 4 వేల మంది విద్యార్థులు సబ్ జూనియర్స్ విభాగంలో వివిధ పోటీల్లో పాల్గొన్నారు. జానపద నృత్యాలు, నా టికలు, సంగీతం తదితర అంశాల్లో వారి ప్రద ర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 350 జానపద నృత్యాలు వేదికల వద్ద ప్రే క్షకుల కరతాళ ధ్వని.. మిన్నం టంది. 54 నాటిక లు చిన్నారులకు సమాజం పట్ల ఉన్న దృక్పథా న్ని, సామాజిక అవగాహనను వెలికితీసే విధంగా సాగాయి. కథ, కవిత, లేఖా రచనలు వారిలోని సృజనాత్మకతను బయటకు తీశాయి. న్యాయ నిర్ణేతలు విద్యార్థులు ప్రత్యేక బోధనలు చేశారు. పోటీల అనంతరం గజల్ శ్రీనివాస్ నిర్వహించిన సంగీత కచేరి చిన్నారులను అలరించింది.




బాలోత్సవంలో బహుమతి ప్రదానం చేస్తున్న గజల్ శ్రీనివాస్ తదితరులు



మిర్చియార్డు కింగ్ 341

- క్వింటాల్‌కు రూ. 17 వేల ధర
- కర్ణాటక రకం 2043 అయితే రూ. 20 వేలు
- పెరగని 'తేజ'స్సు





గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో మిర్చి ధరలు ఘాటెక్కాయి. కారం తయారీకి వినియోగించే 341 వెరైటీ మిర్చికి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చి యార్డు)లో డిమాండ్ గణనీయంగా పెరిగింది. సీజన్‌లో ఈ రకం మిర్చి క్వింటాల్ ధర రూ.13 వేల మధ్యనే ఉండగా నేడు రూ. 17 వేలకు పెరిగింది. దేశీయంగా ఉన్న డిమాండ్ దృష్ట్యా ఈ వెరైటీకి రాబోయే రోజుల్లో మరింత ధర పెరగొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో రైతులు, స్టాకిస్టులు ఆచితూచి తమ వద్ద ఉన్న మిర్చి నిల్వలను యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. మరోవైపు కర్ణాటకలో మాత్రమే పండే 2043 రకానికి కూడా విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీనిని కూడా కారం తయారీకే వినియోగిస్తారు. ఈ రకం మిర్చిని ఆ రాష్ట్రానికి చెందిన రైతులు మిర్చి యార్డుకు తీసుకొస్తుండగా ఎగుమతిదా రులు పోటీపడి క్వింటాల్ రూ.19 వేల నుంచి రూ.20 వేలకు కొనుగోలు చేస్తోన్నారు.

పెరగని తేజస్సు..

గుంటూరు మిర్చి యార్డు ఘాటు వెరైటీలకు పెట్టింది పేరు. అందులో ముఖ్యమైన రకం తేజ. ఇది ఎక్కువగా చైనా, బంగ్లాదేశ్‌లకు ఎగుమతి అవుతుంటుంది. అయితే ప్రస్తుతం ఎగుమతులు అంత ఆశాజనకంగా లేకపోవడంతో తేజ వెరైటీ మిర్చి అంతంత మాత్రంగానే విక్రయం జరు గుతోంది. ఈ కారణంగా ధర క్వింటాల్ రూ. 14 వేల నుంచి రూ.15 వేల మధ్యనే కొనసాగుతోంది. ఎక్స్‌పోర్టు ఆర్డర్స్ వస్తే తప్పా తేజ వెరైటీ ధర పెరగదని ఎగుమతిదారులు తెలిపారు. పైగా ఈ రకం స్టాకులే కోల్డ్ స్టోరేజ్‌లలో ఎక్కు వ శాతం ఉన్నట్టు చెబుతున్నారు. ప్రస్తుతం మాత్రం 341, 2043(కర్ణాటక), బ్యాడిగి వెరైటీల మిర్చి అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి.

341కు పెరిగిన డిమాండ్


ఇటీవల ముఖ్యంగా ఊరగాయ పచ్చళ్ల కోసం బాగా ఎరుపు రంగులో ఉండే 341 వెరైటీ మిర్చితో తయారు చేసిన కారాన్ని ఉత్పత్తిదా రులు వినియోగిస్తున్నారు. ఈ రకం కారంలో పెద్దగా ఘాటు ఉండదు. పచ్చళ్లు చాలా ఎర్రగా కనిపిస్తుంటాయి. అలానే ఈ వెరైటీ మిర్చి నుంచి ఎర్ర రంగు తీసి కొన్ని ఔషధాల్లో కూడా వినియోగిస్తుంటారు. దీంతో ప్రస్తుతం మిర్చి యార్డులో అన్‌సీజన్ అయినప్పటికీ 341 రకం మిర్చికి మంచి డిమాండ్ ఏర్పడింది. నిత్యం విక్రయం జరుగుతున్న 50 వేల మిర్చి టిక్కీలలో 20 నుంచి 22 శాతం వరకు ఈ వెరైటీ బస్తాలే ఉంటున్నాయి. ఇటీవల భయపెట్టిన మొంథా తుపాను వల్ల పంట దెబ్బతిందని, మార్కెట్‌కు రావడం ఆలస్యమవుతుందన్న ఊహాగానాలతో ఎగుమతి దారులు మిర్చి యార్డులో వివిధ రకాలు కొనుగోలు చేసి స్టాకు పెట్టుకొంటున్నారు.

తెనాలి, బాపట్ల మీదగా శబరిమల స్పెషల్స్


గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం తెనాలి, బాపట్ల మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07109 కాకినాడటౌన్ - కొట్టాయం స్పెషల్ ఈ నెల 17, డిసెంబరు 1, 8, 15, 22, 29, జనవరి 5, 12, 19 తేదీల్లో తెనాలి, బాపట్ల, చీరాల మీదగా ప్రయాణిస్తుంది. 07110 కొట్టాయం - కాకినాడటౌన్ స్పెషల్ ఈ నెల 18, డిసెంబరు 2, 9, 16, 23, 30, జనవరి 6, 13, 20 తేదీల్లో పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమవుతుంది. రెండు రైళ్లు కలిపి మొత్తం 18 సర్వీసులు ఉంటాయి. వీటికి అడ్వాన్స్ బుకింగ్ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు.

ప్రకాశం బ్యారేజీ దిగువకు 53,400 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 60,946 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 53,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 2311, పశ్చిమ డెల్టాకు 5009, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.


ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

మూతపడిన సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లు



విజయపురిసౌత్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో శనివారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లను మూసివేశారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 589.60 అడుగులు ఉంది. ఇది 310.84 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5297 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,226 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,323 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 51,323 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విద్యుత్ ప్రాజెక్టులో 0.7885 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.7885 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను మీటర్.. మరో 2 గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 22,640, టేల్ రేస్‌ఛానల్ ద్వారా 8469 క్యూసెక్కులు మొత్తంగా 31109 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 34,226 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానం.

విశ్రాంతి లేకుండా తిప్పిస్తున్నారు..

- పీఎఫ్ ముగింపు సొమ్ము కోసం ఎదురు చూపులు
- విశ్రాంత ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు
- పది నెలలు గడుస్తున్నా లెక్క తేల్చని వైనం
- జడ్పీ సిబ్బంది అలసత్వం....లోపించిన అధికారుల పర్యవేక్షణ
- జనవరి 2022 పీఎఫ్ చందా మొత్తాలు ఎగవేసినట్లేనా?

గుంటూరు(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో పీఎఫ్ విభాగం సిబ్బంది అలసత్వం.. అధికారుల పర్యవేక్షణ లోపం ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నాయి. పీఎఫ్ సెక్షన్‌లో సిబ్బంది అలవిమాలిన నిర్లక్ష్యం విశ్రాంతి తీసుకోవాల్సిన వారిని.. కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగేలా చేస్తోంది. సంవత్సరం నుంచి పీఎఫ్ ముగింపు సొమ్ము కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూడాల్సి వస్తోంది.

సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం..

ఉమ్మడి జిల్లాలో మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న 10 వేల మందికిపైగా ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పీఎఫ్ ఖాతాలను జడ్పీలోని పీఎఫ్ విభాగం సిబ్బంది నిర్వహిస్తారు. ప్రతి నెలా ఉద్యోగుల జీతాల్లో మినహాయించిన పీఎఫ్ చందాలను ట్రెజరీ శాఖ నుంచి వచ్చిన వివరాలతో సరి చూసుకొని వాటిని వారి వ్యక్తిగత పీఎఫ్ ఖాతాలకు జమ చేస్తారు. అదేవిధంగా రుణాల మంజూరు, మరణించిన, పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఖాతాలను వడ్డీతో ముగించి ఆ సొమ్మును ప్రతి నెలా సీఎఫ్ఎంఎస్ గేట్‌వే ద్వారా వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేస్తారు. ఈ మొత్తాలు 3 నుంచి 4 నెలల్లోపు విడుదల అవుతాయి. అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నెలల తరబడి బిల్లులకు మోక్షం కలగడం లేదు.

- జడ్పీలో మండల పరిషత్ టీచర్లకు ఒక సెక్షన్, జిల్లా పరిషత్ టీచర్లకు, బోధనేతర సిబ్బం దికి మరొక సెక్షన్ ఉంటుంది. ప్రతి సెక్షన్‌లో ఒక ఏఓ, 10 మంది చొప్పున సిబ్బంది ఉంటారు.
- ప్రాథమిక పాఠశాల టీచర్ల సెక్షన్‌లో రిటైరయిన రెండు నెలలకే ముగింపులు పరిష్కరిస్తుంటే, జడ్పీ టీచర్ల పీఎఫ్ చూసే సెక్షన్‌లో విశ్రాంత టీచర్ల ముగింపు సొమ్మునకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రాసెస్ చేసి లోకల్ ఫండ్ (ఎల్ఎఫ్) ఆడిట్‌కు పంపేందుకు.. కనీసం 5 నెలలు పడుతుందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న సిబ్బంది చేయి తడిపితేనే ఫైల్‌కు మోక్షం కలుగుతోందన్న విమర్శలున్నాయి. ఆ తరువాత కూడా ఫైల్ కదలడానికి నెల రోజులు పడుతుందని చెబుతున్నారు. మళ్లీ ఆ తర్వాత బిల్లులు చేయడానికి మరొక నెల పడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.
- పదవీ విరమణ తర్వాత వచ్చే పీఎఫ్ నగదుతో ఇల్లు, పిల్లల వివాహాలు, వైద్య ఖర్చులకు ఉద్యోగులు ఉపయోగించుకుంటారు. పీఎఫ్ సొమ్ము సకాలంలో విడుదల కాకపోవడంతో ఉద్యోగులు, విశ్రాంత ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదనకు గురిఅవుతున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని నరసరావుపేట, ఈపూరు, రొంపిచర్ల, నకరికల్లు మండలాల్లోని జడ్పీ టీచర్ల పీఎఫ్ ముగింపులు పది నెలలుగా పరిష్కరించే వారు కనిపించడం లేదు.
- జడ్పీలో బిల్లులు చేసే సిబ్బందికి ఇటీవల బది లీ చేపట్టారు దీంతో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల ముగింపు ఖాతాలు, లోన్లు ని లిచిపోయినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.
- పీఎఫ్ విభాగంలో పనిచేసే సిబ్బందికి నైపుణ్యం, ఓర్పు నేర్పు, సమర్థత ఉండటం లేదు. కేవలం గుంటూరులో నివాసం కోసం మాత్రమే వచ్చిన సిబ్బందిని ఈ సెక్షన్‌కు బదిలీ చేస్తున్నారని విమర్శలున్నాయి. వారిపై అధికారులకు అజమాయిషీ లేకపోవడం ఉపాధ్యాయులకు శాపంగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి.
- పీఎఫ్ సమస్యలపై 20 రోజులుగా విడతల వారీగా జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈవోకు విన్నవించిన ఫలితం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.
- జనవరి 2022లో మినహాయించిన పీఎఫ్ చందాలు వివరాలు అక్టోబరు 2024లో జడ్పీకి పంపినా ఇంతవరకు ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలో నగదు జమ కాలేదు. జనవరి 2022 నుంచి ఇప్పటి వరకు మరణించిన, పదవీ విరమణ చేసిన 500 మందికిపైగా ఉన్న ఉద్యోగులకు (కనీసం ఒక్కొక్క జనవరి 2022 నుంచి చందా రూ. 10 వేలు) జమ చేయకుండానే ముగింపు చేసి సొమ్ములు చెల్లించడం దారుణమని ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని విశ్రాంత ఉద్యోగులకు జనవరి 2022 చందాతో కలిపి లెక్కగట్టి పీఎఫ్ ఖాతాలను ముగించారని, గుంటూరు జిల్లాలో జనవరి నెల పీఎఫ్ మినహాయింపుల వివరాలు రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సూర్యలంక తీరానికి అనుమతి

- 18 రోజుల తర్వాత పుణ్యస్నానాలు ఆచరించిన భక్తజనం
- పటిష్ట భద్రతా ఏర్పాట్లలో పోలీసులు


సూర్యలంక బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు, భక్తులు

బాపట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బాపట్ల సూర్యలంక సముద్ర తీరం ద్వారాలు శనివారం తెరుచుకున్నాయి. కార్తిక మాసంలో భక్తుల సముద్ర స్నానానికి ఆటంకం తొలగింది. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా సముద్రంలో ఏర్పడిన గుంతల దృష్ట్యా పర్యాటకులను తీరానికి రాకుండా అధికారులు నిషేధించారు. 18 రోజుల తర్వాత ఎట్టకేలకు గట్టి బందోబస్తు, భద్రతల మధ్య తీరానికి అనుమతిచ్చారు. కార్తిక మాసంలో భక్తులు పుణ్యస్నానాలు ఇన్ని రోజులుగా ఇక్కడ ఆచరించలేకపోయారు. అదేవిధంగా ఈ ఏడాది కార్తిక పౌర్ణమి స్నానాలు కూడా లేకుండాపోయాయి. పోలీసు భద్రత, గజ ఈతగాళ్ల గస్తీ, హెచ్చరికల మధ్య జాగ్రత్తగా సముద్ర స్నానాలు ఆచరించే ఏర్పాట్లు చేశారు. పరిధి దాటి తీరంలోకి వెళ్తే.. చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పోలీసులు సూర్యలంక తీరం వద్ద పర్యాటకులకు, సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఆదివారం భక్తుల తాకిడికి అధికంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 21వ తేదీతో కార్తిక మాసం ముగుస్తుంది. ఈ 12 రోజులు సూర్యలంకకు పర్యాటకుల తాకిడి అధికంగా ఉండే అవకాశం కనిపిస్తుంది. గతంలో ప్రతిపౌర్ణమికి రెండు లక్షలు మంది భక్తులు తీరానికి వచ్చేవారు. ఈ నెల 5న ఆంక్షల మధ్య పౌర్ణమి స్నానాలు లేకుండాపోయాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఇప్పటికే తీరంలో తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, జల్లు స్నానం ఏర్పాట్లు వంటివి చేసి మండలపరిషత్, గ్రామ పంచాయతీ అధికారులతోపాటు రూరల్ పోలీసులు, మెరైన్ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.


తీరంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు


గజఈతగాళ్లకు సూచనలు చేస్తున్న పోలీసు అధికారులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు ఉపాధ్యాయులకు సాంస్కృతిక పోటీలు

నరసరావుపేట కల్చరల్, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): పల్నాడు బాలోత్సవం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని బాలోత్సవం సెక్రటరీ కట్టా కోటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ పోటీలలో శాస్త్రీయనృత్యం, నాటికలు, దేశభక్తి గీతాలు, బుర్రకథలు, ముచ్చటగా మూడు నిమిషాలు, జానపద నృత్యం, ఏకపాత్రాభినయం, మైమ్, కోలాటం, పద్యాలు, కవితల వంటి అంశాలు ఉంటాయని చెప్పారు. పోటీలకు గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఏకకాలంలో ఐదు వేదికలపై ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ముఖ్య అతిధులుగా పాల్గొంటున్నార న్నారు. ఉపాధ్యాయులకు భోజనవసతి ఉందన్నారు.

ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

వినుకొండటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరరణకు వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన వినుకొండ పట్టణంలో జరిగే ప్రజా ఉద్యమం పోస్టర్‌ను పట్టణంలోని వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపి నేతలు, కార్యకర్తలు పాల్గొని కూటమి ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి విరాళాలు

పట్టణంలోని దక్షిణం బజారు సమీపంలో పునర్నిర్మిస్తున్న పోలేరమ్మ గుడి నిర్మాణానికి భక్తులు విరాళాలు ప్రకటించారు. విరాళాలు ప్రకటించిన వారిలో ఆలయ పూ జారి గోళ్ళ వెంకటేశ్వర్లు, సీతామహాలక్ష్మి రూ.2లక్షలు, గుడిపాటి రంగారావు, నాగ కమల రూ.1,11,116, నల్లం శ్రీనివాసరావు, ప్రశాంతి రూ.1,11,116, నల్లూరి వీర రాఘవులు, పద్మ 1,01,116, సనిశెట్టి గురవయ్య ధర్మపత్ని పద్మావతి రూ.లక్ష విరాళాలను అందజేశారు.

నారాయణ స్కూల్‌లో ఎస్‌ఎల్‌జీ ప్రోగ్రాం

వినుకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణ స్కూల్‌లో ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఎల్‌జీ ప్రోగ్రాం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన పల్నాడు జిల్లా ఏజీఎం లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ, ఏ పాఠశాలలో లేనివిధంగా నారాయణలో విద్యార్థులకు యాక్టివిటీ బేస్‌లో తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌డీ హెడ్ మారియా, కోఆర్డినేటర్ రిహాని, వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాములకు సద్ది ఏర్పాటు

స్థానిక పాతశివాలయంలో అయ్యప్పస్వామి అన్నదానకమిటీ ఆధ్వర్యంలో మాలాధారణ స్వాములకు 41 రోజులపాటు సద్ది కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో భాగంగా 18వ రోజు వినుకొండకి చెందిన వ్యాపారవేత్త పెమ్మసాని కోటేశ్వరరావు సద్ది ఏర్పాటుచేశారు. నిర్వాహకులు దంపతులను సత్కరించారు.

జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు సంసిధ్ విద్యార్థులు

కనమర్లపూడి (శావల్యాపురం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కనమర్లపూడిలోని సంసిధ్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సాగర్‌బాబు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వినుకొండలోని లయోలా హైస్కూల్‌లో ఈ నెల 7వ తేదీన నిర్వహించిన డివిజనల్‌స్థాయి ఖోఖో పోటీల్లో అండర్-14 విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

కరాటేలో మోడరన్ స్టెల్లార్ విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీలలో స్థానిక మోడరన్ స్టెల్లార్ స్కూలు విద్యార్థులు ప్రతిభ చూపారు. గోవా, కరసవాడలో జరిగిన అంతర్జాతీయ స్థాయి షోటోకాన్ పోటీలలో 32 దేశాలు పాల్గొన్న ఈ పోటీలలో టెన్త్ విద్యార్థి డీ జస్వంత్ వివిధ విభాగాలలో 2బంగారు, వెండిపతకం సాధించాడు. విజయవాడలో ఆల్ స్టైల్ మార్షల్‌ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో 8వ తరగతి విద్యార్థులు గుంజి కార్తీక్, వై జాహ్నవి, 7వ తరగతి విద్యార్థి గుంజి మోహనకృష్ణ, 3వ తరగతి విద్యార్థి వై హరిణి బంగారు, వెండి పతకాలు సాధించారు. వీరిని స్కూలు వ్యవస్థాపకులు మహేష్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ప్రసూన శనివారం సత్కరించారు.

అన్నప్రసాద వితరణ

స్థానిక చిన్నపసుమర్రు అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వాములకు, మాలధారులకు దాతలు, భక్తుల సహకారంతో జరుపుతున్న కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వెల్లంపల్లి రవిశంకర్ ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీహరిబాబు దంపతులను సన్మానించారు.

దుప్పట్ల పంపిణీ - అన్నదానం

తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి క్లస్టర్ మద్దిబోయిన శివ తనయుడు మద్దిబోయిన వెంకటేష్ 8వ వర్ధంతి సందర్భంగా స్థానిక రైతుబజారు సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా శనివారం 2వేలమందికి దుప్పట్ల పంపిణీ, మరో 2వేలమందికి అన్నదానం చేశారు. తొలుత వెంకటేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీనియర్ టీడీపీ నాయకులు మానం వెంకటేశ్వర్లు, నెల్లూరు సదాశివరావు, షేక్ కరిముల్లా, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మించాలని డిమాండ్

నూతనంగా నిర్మించిన వాడరేవు- చిలకలూరిపేట రోడ్డులో పసుమర్రు నుండి వింజనంపాడు వెళ్లే మార్గంలో అండర్‌పాస్ నిర్మాణం చేయాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన మేరకు డిజైన్లు మార్పులు చేయాలని, ప్రమాదసూచికలను తక్షణమే ఏర్పాటుచేయాలని సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్, పసుమర్రు, వింజనంపాడు గ్రామాల పెద్దలు, తూబాటి బాలకృష్ణ శనివారం కోరారు. వారంతా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. పదుల సంఖ్యలో ప్రాణాలు పోతున్నా అధికారులు తగు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను, తీసుకోవాల్సిన చర్యల గురించి నేషనల్ హైవేస్ అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

నిరసన ర్యాలీని విజయవంతం చేయండి

నరసరావుపేట రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చేస్తున్న ప్రజా ఉద్యమ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని వైసీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆయన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12వ తేదీన చేపట్టనున్న ప్రజాఉద్యమ నిరసన ర్యాలీ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయంపై నిరసనగా స్థానిక పార్టీ కార్యాలయం నుండి మల్లమ్మ సెంటర్ మీదుగా ఆర్డీఓ ఆఫీస్ వరకు ర్యాలీ చేపట్టనున్నామని తెలిపారు.

అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్‌కు సత్కారం


ర్యాలీలో పాల్గొన్న అజయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డికి శనివారం నరసరావుపేటలో ఘన సత్కారం జరిగింది. పట్టణంలోని లూథరన్ అంధుల పాఠశాల పూర్వవిద్యార్థి అయిన అజయ్‌కుమార్‌రెడ్డికి ఆ పాఠశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ముందుగా అజయ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వాగతం పలికి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి లూథరన్ పాఠశాల వరకు ర్యాలీగా తీసుకెళ్లారు. అక్కడ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో అజయ్‌కుమార్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ, అజయ్‌కుమార్‌రెడ్డి అంధుల క్రికెట్ చరిత్రలో సువర్ణ అధ్యాయం సృష్టించారని, ఆయన విజయాలు దివ్యాంగులకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యాభ్యాసానికి ఆలవాలమైన లూథరన్ అంధుల పాఠశాల నరసరావుపేట ప్రజలు ఎప్పటికీ మరచిపోలేని బలమని అన్నారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయ్‌కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, మడకా శివప్రసాద్, నెలటూరి మురళి, లూథరన్ పాఠశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రెయినేజీ ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు శనివారం 15వ వార్డులో రూ.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీని, శాలివాహన నగర్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, పట్టణ ప్రజలు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న మురుగునీటి పారుదల, రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, పట్టణ నాయకులు, మున్సిపల్ అధికారులు, జనసేన, బీజేపీ, టీడీపీ ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత శుక్లాల వైద్య శిబిరం ప్రారంభం

పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో ఉచిత కంటి శుక్లాల వైద్య శిబిరాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శనివారం ప్రారంభించారు. శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణసంస్థ, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరం ద్వారా కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో చంద్రకళ

నాదెండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నైపుణ్య పోటీల్లో చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సత్తెనపల్లి సమీపంలోని లిథం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో చిరుమామిళ్ళ మోడల్ పాఠశాలకు చెందిన వై.సాగరిక, బి.గీతాంజలి సైంటిఫిక్ క్యాలిక్యులేటర్ అనే యాప్‌ను రూపొందించి జిల్లాస్థాయిలో తృతీయబహుమతి సాధించారు. బహుమతిని డీఈవో చంద్రకళ అందించగా ప్రిన్సిపల్ పద్మజ తదితరులు అభినందించారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన

యడ్లపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రత, మంచి అలవాట్లపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. తిమ్మాపురం గ్రామానికి చెందిన సువర్ణకుమారి ఫౌండేషన్ సహకారంతో మండలంలోని సంతపేట, కోట, కొత్తపాలెం గ్రామాల్లోని ఎంపీపీఎస్ పాఠశాలలతోపాటు కొండవీడులోని జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ప్రసాదరావు, ఉపాధ్యాయులు జున్నుసాహెబ్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ సూపర్‌చెక్ నిర్వహించిన జేడీఏ


రావిపాడులో ఈ క్రాప్ బుకింగ్ పరిశీలిస్తున్న జేడీఏ జగ్గారావు

నరసరావుపేట రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో రైతులు సుమారుగా 2 లక్షల హెక్టార్లలో ఈ క్రాప్ నమోదుచేసుకున్నారని జేడీఏ జగ్గారావు తెలిపారు. పల్నాడు జిల్లాలో ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులను సూపర్‌చెక్ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ క్రాప్‌లో నమోదుచేసుకున్న పంట, రైతు పొలంలో పరిశీలించి నమోదు చేస్తున్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులలో రాండమ్‌గా కొన్నింటిని పరిశీలించడం జరుగుతుందని జేడీఏ జగ్గారావు తెలిపారు.

హోరాహోరీగా ఖోఖో పోటీలు

వినుకొండటౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక లయోలా పాఠశాలలో జరుగుతున్న అండర్-14, అండర్-17 బాలబాలికల ఖోఖో పోటీలు శనివారం హోరాహోరీగా కొనసాగాయి. జిల్లా జట్టులో స్థానం కోసం క్రీడాకారులు నువ్వా నేనా అన్నట్లు తలపడ్డారు. విజేతలకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు బహుమతులు అందజేసి అండర్-14, 17 బాలబాలికల విభాగంలో జిల్లా జట్టును ఎంపిక చేస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు పుల్లయ్య, సెక్రటరీ సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు రాజేశ్, ఝాన్సీ వెంకటేశ్వర్లుతో పాటు వివిధ పాఠశాలల్లో నూతనంగా ఎంపికైన పీఈటీలు పాల్గొన్నారు.

చిత్రకారిణి విజయకు అభినందన


విజయ గీసిన నాట్యరాణి

వినుకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్రకళా ప్రదర్శన పోటీల్లో అవార్డు సాధించిన వినుకొండ చిత్రకారిణి రావులపాటి విజయను పలువురు అభినందించారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఈ నెల 3న నిర్వహించిన బాలోత్సవ్ పోటీల్లో విజయ గీసిన చిత్రం ఉత్తమ ప్రతిభా పురస్కారానికి ఎంపికయింది. ఆమెకు మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, ఆర్ట్ గిల్డ్ అధ్యక్షుడు బీఏ రెడ్డి, రాష్ట్ర సంస్కృత, తెలుగు అకాడమీ అధ్యక్షుడు శరశ్చంద్ర, రాష్ట్ర క్రియేటివిటీ ఆర్ట్ అకాడమీ అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని, సుభాష్ బాబు, డ్రీమ్ రమేశ్ తదితరులు అవార్డును అందించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న త్రిపురాపురం డీసీ చైర్మన్ గంగినేని రాఘవ, ఉపాధ్యాయులు

నూజెండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడం, పర్యావరణాన్ని పరక్షించటం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని త్రిపురాపురం డీసీ చైర్మన్, గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగినేని రాఘవ అన్నారు. శనివారం మండలంలోని కంభంపాడు జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ జీవరాసుల మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. భూవాతావరణం వేడెక్కకుండా ఉండేందుకు విస్తృతంగా మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎల్ రామాంజిరెడ్డి, కొత్తూరి రామారావు, మేదరమెట్ల పేరేశ్వరరావు, చెన్నయ్య, కంకణంపాటి రోశారావు, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వైవీ చిరంజీవి, పీడీలు నిడమానూరి వెంకటరత్నం, అంగటి బాజు, ఏ సోమసూర్య, ప్రకాశరావు, చిన్న గోవిందు, శేఖర్, సురేష్, పాపసాని చిన రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వృత్తికి చట్టబద్ధత కల్పించాలి

● ఏపీఎంపీఏ డివిజన్ అధ్యక్షుడు షేక్ బాజీ

నాదెండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ, పీఎంపీల ప్రాథమిక వైద్యవృత్తికి చట్టబద్ధత కల్పించాలని ఏపీఎంపీఏ నరసరావుపేట డివిజన్ అధ్యక్షుడు షేక్ బాజీ కోరారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆర్ఎంపీ జాయింట్ యాక్షన్ కమిటీ తరుపున గుంటూరులోని ఆయన కార్యాలయంలో శనివారం కలసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంఎల్‌సీ, అనుభవ వైద్య సంఘాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు టీడీ జనార్ధన్, వ్యవస్థాపక అధ్యక్షుడు పి.రాజాసిద్దార్థ, నరసరావుపేట డివిజన్ కమ్యూనికేటర్ ఆరేటి నాగేశ్వరరావు, పలు జిల్లాల ఆర్ఎంపీ నాయకులు కేంద్ర మంత్రిని కలిశారు. త్వరలో గుంటూరులో నిర్వహించబోయే జేఏసీ భారీ సభకు హాజరుకావాలని ఆహ్వానించారు.

ఏకగ్రీవంగా పట్టణ టీడీపీ టీఎన్టీయూసీ కమిటీ ఎన్నికలు

చిలకలూరిపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ టీఎన్టీయూసీ కమిటీ ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. కమిటీ అధ్యక్షుడుగా అద్దంకి వరప్రసాద్, ప్రధానకార్యదర్శిగా షేక్ అల్లాబక్షు, ఉపాధ్యక్షులుగా పల్లపు వీరయ్య, కొనికినేని వీరాంజనేయులు ఎన్నికయ్యారు.కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు సమద్‌ఖాన్, మద్దుమాల రవి, మురకొండ మల్లిబాబు పాల్గొన్నారు.


నిర్మాణ పనులను పరిశీలించిన చైర్మన్, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు

ఫిష్ మార్కెట్ నిర్మాణ పనుల పరిశీలన

చిలకలూరిపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌సెంటర్‌లో రూ.1.20కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఫిష్‌మార్కెట్ భవనాన్ని శనివారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కౌన్సిలర్లు పరిశీలించారు. ఇప్పటివరకు రోడ్డుపైనే మటన్, చికెన్, ఫిష్ వ్యాపారదుకాణాలు ఉండేవని, వ్యాపారస్తులు అనేక ఇబ్బందులు పడేవారని, వారి ఇబ్బందులను దృష్టిలోపెట్టుకొని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో అధునాతన వసతులతో శాశ్వత దుకాణ సముదాయాన్ని నెలకొల్పుతున్నామని చైర్మన్ చెప్పారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, కౌన్సిలర్లు పి.శివకుమారి, కే కుమారి, ప్రమీల, కనమార్లపుడి లక్ష్మీతిరుమల పాల్గొన్నారు.

చిలకలూరిపేట యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రం

స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఈ నెల 10 లేదా 12 తేదీలలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభమవుతుందని మార్కెట్‌కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా శనివారం తెలిపారు. ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శివానితో డాక్టర్ శివరామకృష్ణ తదితరులు

నేత్ర శిబిరంలో 314 మందికి వైద్య పరీక్షలు

నరసరావుపేట టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజాగారికోట డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆసుపత్రిలో శనివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం జరిగింది. డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరంలో 314మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 118మందికి శస్త్రచికిత్సకు సిఫార్సు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 94మందికి కళ్ళజోళ్ళు పంపిణీచేశారు. శంకర కంటి ఆసుపత్రివైద్యులు డాక్టర్ శివాని వైద్యసేవలు అందజేశారు. ముందుగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ ఎన్‌టీఆర్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, గంగుల పెద్దిరెడ్డి, కొక్కిరాల శ్రీనివాసరావు, మందాడి రవి, బొడ్డపాటి పేరయ్య పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న ఏఎం రెడ్డి విద్యాసంస్థల ప్రతినిధులు, హెచ్‌డీఎఫ్‌సీ అధికారులు

రక్తదాన శిబిరం

నరసరావుపేట టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్, బీ ఫార్మసీ, డిప్లొమో విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా శిబిరాన్ని నిర్వహించాయి. నరసరావుపేట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ శాఖ ప్రతినిధులు రక్తదానం చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, బీ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవభూషణరావు, డిప్లొమో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల సత్తా

రొంపిచర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రవినాయక్ శనివారం తెలిపారు. కబడ్డీ అండర్-14 విభాగంలో తమ పాఠశాల విద్యార్థి అహరోను రాష్ట్రజట్టుకు, విజయ కుమార్, శ్రీను, విజయ్, నాగరాజు జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. మహిళల అండర్-17 విభాగంలో జెస్సీ, హయత్మాదేవి, ఝాన్సీ రాణి, విష్ణుప్రియ జిల్లాజట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. అలాగే చెస్‌లో అండర్-14 విభాగంలో అఖిల్‌రెడ్డి జిల్లా జట్టుకు, జావెలిన్‌త్రో అండర్-17 విభాగంలో వేణుమాధవ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

మేలు జాతి లేగదూడల ప్రదర్శన

బొల్లాపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మనంపాడులో పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖల ఆధ్వర్యంలో మేలుజాతి లేగదూడల ప్రదర్శనశనివారం జరిగింది. ఈ సందర్భంగా ఈపూరు పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ లింగ నిర్ధారణ, కృత్రిమ గర్భధారణ గురించి రైతులకు సూచించారు. 30మంది రైతులకు చెందిన 36 లేగదూడలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. దూడలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారులు జీ కవిత, వీ గోపాల్ నాయక్, బాల సైదారెడ్డి, శ్రావణి, సాంబశివ నాయక్, రామకృష్ణ, వెంకటాద్రి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.


పశుదాణా ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఈపూరు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పీ శ్రీనివాసమూర్తి


మాట్లాడుతున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

150 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

నరసరావుపేట రూరల్, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం 5వ వార్డు క్రిస్టియన్‌పాలెంలో వైసీపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్థానికంగా 150 కుటుంబాలు స్వచ్ఛందంగా వైసీపీని వీడి శనివారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎస్సీ వర్గీకరణ చేసిన మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీ అక్రమాలు చూసి భరించలేక స్వచ్ఛందంగా టీడీపీలోకి చేరుతున్నారన్నారు. అడ్వకేట్ మల్లెల అశోక్ తోపాటు 150 ఎస్సీ కుటుంబాల చేరిక ఆనందదాయకం.. ఇదే ఉత్సాహంతో 2029 ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొట్టా కిరణ్ కుమార్, కపిలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, గట్టుపల్లి సత్యనారాయణ, బత్తుల సెల్వరాజ్, తదితరులు పాల్గొన్నారు. కొత్తగా చేరిన సభ్యులకు నాయకులు పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యార్థులు వృత్తి విద్య కోర్సులపై మొగ్గు చూపాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సుల పట్ల కూడా ఆసక్తి చూపాలని గోల్కొండ గ్రూప సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. చిరుమామిళ్ళ గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చదువుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగాలు రావటం కష్టంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు 9వ తరగతి నుంచే వృత్తి విద్యా కోర్సుల పట్ల మొగ్గు చూపాలన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం కూడా వృత్తి విద్యా కోర్సులు కలిగిన వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. సమావేశంలో హెచ్ఎం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్ సీఐగా సుబ్బారావు



నరసరావుపేట రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీలో భాగంగా నరసరావుపేట రూరల్ సీఐగా ఎంవీ సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ నేర నియంత్రణ, ప్రజాభద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తానని తెలిపారు.